


# కెరటం న్యూస్

(సామాన్యుడి ఆయుధం)




Published from.. Hyderabad, Khammam, Warangal, Nalgonda

సంపుటి : 04 సంచిక :183 | ఆదివారం 06 జులై 2025 | ఎడిటర్ : వనం నాగయ్య | పేజీలు : 4 ఫోన్ : 9441877695

## నిర్లక్ష్యం వద్దు.. డెడ్ లైన్ పెట్టుకుని పని చేయాలి

అధికారులకు మంత్రి ఆదేశం



## ప్రియుడితో మాట్లాడొద్దని చెప్పినందుకు

# భర్తని హత్య చేసిన భార్య..

**న్యూస్ డెస్క్ ,05 జులై (కెరటం న్యూస్):** ఈ మధ్య ప్రియుడి కోసం భార్యలు భర్తలను కృరంగా హతమారుస్తున్న ఘటనలు వెలుగు చూస్తేనే ఉన్నాయి. తాజాగా అలాంటి ఓ ఘటన తెలంగాణ రాష్ట్రం నారాయణపేట జిల్లా పరిధిలో చోటు చేసుకుంది. ప్రియుడితో మాట్లాడొద్దని చెప్పినందుకు కట్టుకున్న భర్తని దారుణంగా హత్య చేసింది ఓ భార్య. భర్తను హత్య చేసి ఆత్మహత్యగా క్రియేట్ చేసింది. తాగిన మత్తులో ఉన్న భర్త ఛాతిపై కూర్చొని గొంతు నులిమి కిరాతకంగా చంపింది.

కర్ణాటక సరిహద్దులోని నారాయణపేట జిల్లా(మండలం) కోటకొండ గ్రామానికి చెందిన అంజిలప్ప(32)కు ధన్వాడ మండలం రాంకిష్టయ్య పల్లి గ్రామానికి చెందిన రాధతో పదేళ్ల కిందట వివాహం జరిగింది. వీరికి ఇద్దరు పిల్లలు. బతుకుదెరువు నిమిత్తం హైదరాబాద్‌లోని బాచుపల్లికి వచ్చారు.



## 7 లక్షల రేషన్ కార్డులు

## తొలగించేందుకు కుట్ర : ఎమ్మెల్సీ కవిత

**న్యూస్ డెస్క్ ,05 జులై (కెరటం న్యూస్):** రాష్ట్రంలో మూడు నెలలు సన్న బియ్యాన్ని 7.24 లక్షల మంది రేషన్ కార్డుదారులు తీసుకోలేదని, ఆ కార్డుల రద్దుకు కాంగ్రెస్ సర్కార్ కుట్ర చేస్తోందని తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు, బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కవిత అనుమానం వ్యక్తం చేశారు. వర్షాకాలం నేపథ్యంలో జూన్‌లో మూడు నెలల రేషన్ పంపిణీ జరిగిందని తెలిపారు



## కాంగ్రెస్ ప్రభుత్వంలోనే

## పేదలకు భరోసా- మంత్రి ఉత్తమ్



●కొత్తగా 4.76 లక్షల రేషన్ కార్డులకు ఆమోదం ●తుంగతుర్తిలో జూలై 14న కొత్త రేషన్ కార్డుల పంపిణీ ప్రారంభం ●మొత్తం 41 లక్షల మందికి రేషన్ ప్రయోజనం – మంత్రి ఉత్తమ్ ●డీకేఆర్‌లో నమోదు చేసినవారికే రేషన్ లబ్ధి – ప్రభుత్వం స్పష్టం● న్యాయస్థానంలో టెండర్ వివాదం కారణంగా కాగితం రూపంలోనే రేషన్ కార్డులు

## 72 గంటల సమయం రేవంత్‌కు ఇస్తున్నాం

# ప్రిపేర్ అయ్యి రండి

●జులై 8న సోమాజీగూడ ప్రెస్ క్లబ్‌లో చర్చకు వస్తాం
●రైతు బంధుపై ఆక్స్‌ఫర్డ్‌లో ప్రశంసలు వచ్చాయి
●ఇందిరమ్మ రాజ్యం అంటే కాలిపోతున్న మోటార్లు
●రేవంత్ ప్రభుత్వం ఎరువులు, విత్తనాలు ఏమీ ఇవ్వలేకపోయింది
●రాహుల్, ప్రియాంక బ్యాంక్ బ్యాలెన్స్ పెంచడమే పని
– కేటీఆర్



**న్యూస్ డెస్క్ ,05 జులై (కెరటం న్యూస్):** తెలంగాణలో మరోసారి రాజకీయం హీటెక్కింది. సీఎం రేవంత్ రెడ్డి సవాల్‌ను స్వీకరిస్తున్నట్టు బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ తెలిపారు. ఎక్కడైనా, ఎప్పుడైనా చర్చకు రెడీ. సోమాజీగూడ ప్రెస్ క్లబ్‌లో 8వ తేదీన 11 గంటలకు చర్చ వస్తామని కేటీఆర్ ప్రతి సవాల్ విసిరారు.

మాజీ మంత్రి, బీఆర్ఎస్ ఎమ్మెల్యే కేటీఆర్ తెలంగాణభవన్‌లో మీడియాతో మాట్లాడుతూ..'తెలంగాణలో రైతు బంధు విప్లవాత్మక పథకం. రైతు బంధుపై ఆక్స్‌ఫర్డ్‌లో ప్రశంసలు వచ్చాయి. ఎరువులు కూడా ఇవ్వలేని సీఎం మమ్మల్ని విమర్శిస్తారా?. ఇందిరమ్మ రాజ్యంలో చెరువులు ఎండితే మేము కళకళలాడేలా చేశాం. చంద్రబాబు రైతులు గొంతు కోశారు. జల దోపిడీని సీఎం రేవంత్ అడ్డుకోవడం లేదు. దత్తత పేరుతో పాలమూరును దగ చేసింది ఎవరో ప్రజలకు తెలుసు. ఫ్లోరైడ్ మహమ్మరిని తరిమికొట్టింది కేసీఆర్ కాదా?. తెలంగాణ రాష్ట్రం ఏర్పాటైన కొత్తలోనే రూ.30వేల కోట్ల రైతు రుణమాఫీ చేశాం. కేసీఆర్ నాయకత్వంలో తెలంగాణ రూపురేఖలు మార్చాం' అని చెప్పుకొచ్చారు.

18 నెలలుగా తెలంగాణ టైమ్ పాస్ పాలన నడుస్తుంది. మీ స్థాయికి కేసీఆర్ అవసరం లేదు మేము చాలు.. ఎక్కడికి పిలిచిన రెడీ. 72 గంటల సమయం రేవంత్‌కు ఇస్తున్నాం. ప్రిపేర్ అవ్వడానికి సమయం ఇస్తున్నా. ప్లేస్ ఎక్కడ అనేది రేవంత్ రెడ్డి చెప్పాలి. ఇందిరమ్మ రాజ్యం అంటే కాలిపోతున్న మోటార్లు, అందుబాటులో లేని ఎరువులు, విత్తనాలు. ప్రతీ మండలం లో ఎరువుల కోసం క్యూ లైన్ లో రైతులు ఎదురు చూసే పరిస్థితి. కేసీఆర్ ఉచితంగా రైతులకు కరెంట్ ఇచ్చారు. రైతులకు రైతు భీమా ఎగ్గొట్టి రైతుల ఉసురు తీస్తుంది కాంగ్రెస్..

## మహిళలను కోటీశ్వరులను చేయడమే లక్ష్యంగా ముందుకు: డిప్యూటీ సీఎం భట్టి



**న్యూస్ డెస్క్ ,05 జులై (కెరటం న్యూస్):** ఆర్టీసీలో 151 మండల మహిళా సంఘాల గ్రూప్‌లకు (అద్దె బస్సుల యజమానులకు) రూ.1.05 కోట్ల రూపాయల చెక్కును డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, మంత్రులు పొన్నం ప్రభాకర్, సీతక్క అందజేశారు. అనంతరం మహిళా రచయితలు, కవులు రాసిన మహాలక్ష్మి (మహిళా సాధికారత లో ప్రగతి చక్రాలు) పుస్తకాన్ని ఆవిష్కరించారు.

## పీఎన్‌బీ కుంభకోణం కేసు.. నీరవ్ మోదీ సోదరుడు అమెరికాలో అరెస్ట్..!

**న్యూస్ డెస్క్ ,05 జులై (కెరటం న్యూస్):** పంజాబ్ నేషనల్ బ్యాంక్ కుంభకోణంలో పారిపోయిన వజ్రాల వ్యాపారి నీరవ్ మోదీ సోదరుడు నేహల్ మోదీని అమెరికాలో అరెస్టు చేశారు. భారత్ ప్రభుత్వం విజ్ఞప్తి మేరకు నేహల్ మోదీని అమెరికా పోలీసులు అరెస్టు చేశారు. అమెరికా న్యాయశాఖ ప్రకారం.. బెల్జియన్ జాతీయుడైన నేహల్ మోదీని జులై 4న అదుపులోకి తీసుకున్నారు. అమెరికా ప్రాసిక్యూషన్ ఫిర్యాదు ప్రకారం.. పీఎంఎల్ఏ సెక్షన్ 3 కింద మనీలాండరింగ్, నేరపూరిత కుట్ర, సాక్ష్యాలను చేసినట్లు నేహల్‌పై ఈ రెండు ఆరోపణలు ఉన్నాయి.

## న్యాయం అంటే శిక్షలు కాదు

## బాధితులకు భరోసా కల్పించడం



●బాలల రక్షణపై సమిష్టిగా ముందుకు సాగుదాం ● వాయిస్ ఫర్ ది వాయిస్‌లెస్ థీమ్‌పై రాష్ట్ర స్థాయి సదస్సు ● భరోసా కేంద్రాలు 29 ప్రాంతాల్లో సేవలు –బాలల సంక్షేమానికి కీలకం ● పోక్సో, జువెనైల్ చట్టాల ఆచరణలో మెరుగుదల అవసరం ●సోషల్ మీడియా ద్వారా దుర్వినియోగం చేసే వారిపై కఠిన చర్యలు తీసుకోవాలి ●చైల్డ్ ఫ్రెండ్లీ కోర్టులు ప్రారంభించిన తొలి రాష్ట్రంగా తెలంగాణ గుర్తింపు ●న్యాయం అంటే శిక్షలు కాదు – బాధిత బాలలకు భరోసా కల్పించాలన్న సీఎం విజ్ఞప్తి

**న్యూస్ డెస్క్ ,05 జులై (కెరటం న్యూస్):** హైదరాబాద్ MCRHRD లో స్టేట్ లెవెల్ స్టేక్ హోల్డర్స్ కన్సల్టేషన్ మీట్–2025 కార్యక్రమం నిర్వహించారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా సీఎం రేవంత్ మాట్లాడుతూ.. వాయిస్ ఫర్ ది వాయిస్ లెస్ అనే థీమ్ తో.. తమ బాధను చెప్పుకోలేని వారికి రక్షణ కల్పించేందుకు ప్రస్తుత పరిస్థితుల్లో ఇలాంటి రాష్ట్ర స్థాయి సమావేశం ఏర్పాటు చేయడం చాలా అవసరం. ఎంతో కీలకమైన అంశంపై సదస్సు నిర్వహిస్తున్న తెలంగాణ పోలీసు, ఇతర నిర్వాహకులను అభినందిస్తున్నా.. ఇలాంటి నేరాలను నియంత్రించడమే కాకుండా బాల బాధితులకు చట్టపరమైన అన్ని రకాల రక్షణ కల్పించాల్సి ఉంది.

## పొన్నం.. రేవంత్‌తో రాజీనామా చేపించు: రామచందర్‌రావు



**న్యూస్ డెస్క్ ,05 జులై (కెరటం న్యూస్):** పార్టీ అభివృద్ధికి పని చేసిన ప్రతీఒక్కరికీ కచ్చితంగా అవకాశాలు వస్తాయని రాంచందర్‌రావు పేర్కొన్నారు. బీజేపీ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షునిగా రాంచందర్‌రావు శనివారం బాధ్యతలు స్వీకరించారు. ఈ కార్యక్రమంలో కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి , ఎంపీ డీకే అరుణ, పలువురు సీనియర్ నేతలు పాల్గొన్నారు. దీనికి ముందు ఆయన చార్మినార్ భాగ్యలక్ష్మి అమ్మవారి ఆలయంలో పూజలు నిర్వహించారు. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడారు. పార్టీలో అందరూ ఒకటేనని, తమ మధ్య అభిప్రాయ బేధాలు లేవన్నారు. కాంగ్రెస్ పార్టీకి బీసీల మీద ప్రేమ లేదని రాంచందర్‌రావు ఆరోపించారు.

## అసెంబ్లీలో చర్చిద్దాం రా అంటే.. ప్రెస్ క్లబ్ కు రమ్మనడం ఏంటి?



**న్యూస్ డెస్క్ ,05 జులై (కెరటం న్యూస్):** రైతు సంక్షేమంపై సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో ఈ నెల8 వ తేదీన చర్చకు సిద్ధమని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ సీఎం రేవంత్ రెడ్డి కి సవాల్ చేశారు. ఈ కేటీఆర్ వ్యాఖ్యలపై మంత్రి సీతక్క కౌంటర్ ఇచ్చారు. ఈ మేరకు శనివారం ఆమె ప్రజాభవన్‌లో మీడియాతో మాట్లాడుతూ.. సీఎం రేవంత్ రెడ్డి విసిరిన సవాల్ కేటీఆర్‌కు అర్ధం కానట్లు ఉందని విమర్శించారు.విదేశాలలో ఉన్న కేటీఆర్ తెలంగాణకు వచ్చినట్లు చెప్పేందుకే ప్రెస్ మీట్ పెట్టినట్టుగా ఉందన్నారు.. కేటీఆర్ గుర్తింపు సమస్యతో బాధపడుతున్నాడని, ఏం మాట్లాడుతున్నారో ఆయనకే అర్ధం కావడం లేదన్నారు. అసెంబ్లీలో చర్చిద్దాం రా అంటే.. ప్రెస్ క్లబ్ కు రమ్మనడం ఏంటి? అని ప్రశ్నించారు.

## టేబుల్ టెన్నిస్

## ఆధునిక రోబోట్ ప్రారంభం



# న్యాయం అంటే శిక్షలు కాదు - బాధితులకు భరోసా కల్పించడం

మొదటి పేజీ తరువాయి

లైంగిక వేధింపుల నుంచి అన్ని రకాలుగా రక్షణ కల్పించాల్సిన అవసరం ఉంది. మా ప్రభుత్వం పిల్లలు, మహిళల రక్షణకు అత్యంత ప్రాధాన్యత ఇస్తుంది. బాలికల సంరక్షణ కోసం తెలంగాణ "భరోసా" ప్రాజెక్టును తీసుకొచ్చింది. అనుసంధానంగా 29 కేంద్రాలు పనిచేస్తున్నాయి. ఈ కేంద్రాల ద్వారా పోలీసు సహాయమే కాకుండా న్యాయ పరమైన సహాయం, వైద్య సహాయం, కౌన్సెలింగ్ వంటి సేవలను అందిస్తున్నాయి. హైదరాబాద్ కేంద్రంగా పనిచేస్తున్న భరోసా కేంద్రం ద్వారా చైల్డ్ ఫ్రెండ్లీ కోర్టులను ప్రారంభించిన మొదటి రాష్ట్రంగా తెలంగాణ నిలిచింది. కేసులను వేగవంతంగా పరిష్కరించడమే కాకుండా పిల్లలకు సంపూర్ణ రక్షణ, వారిలో విశ్వాసం, అభివృద్ధికి అవసరమైన చర్యలు తీసుకోవడం ఈ కేంద్రాల లక్ష్యం.

పోక్సో చట్టం, జ్యువెనైల్ చట్టాలు మన ప్రగతిశీల సాధనాలుగా పనిచేస్తున్నాయి. అయితే ఆచరణలో కొన్ని సమస్యలు ఎదురవుతున్నాయి. ఆ చట్టాలు బాధితులకు ఎలాంటి హాని కలిగించకుండా, వారి భవిష్యత్తుకు రక్షణగా సంపూర్ణ సహాయకారిగా ఉండాలి. సోషల్ మీడియా ద్వారా పిల్లలపై జరిగే దురాగతాలు, దుర్వినియోగం చేస్తున్న వారి పట్ల ఎలాంటి కరుణ చూపకుండా దోషుల విషయంలో కఠినంగా వ్యవహరించాలి. ఇందుకు అవసరమైన చర్యలు తీసుకోవడానికి తెలంగాణ ప్రభుత్వం సిద్ధంగా ఉంది. న్యాయం కేవలం కోర్టుల్లోనే కాకుండా ప్రతి దశలోనూ రక్షణ ఉండాలి. పోలీస్ స్టేషన్, బాలల సంక్షేమ కేంద్రాలతో అన్ని ప్రక్రియల ద్వారా పిల్లలకు న్యాయం దక్కాలి. రక్షణ కల్పించాలి.

గౌరవ న్యాయమూర్తులు, పోలీసు అధికారులు బాలల సంక్షేమ కమిటీలు, ఇతర అభివృద్ధి భాగస్వామ్య సభ్యులందరికీ.. విజ్ఞప్తి చేస్తున్నాను. ఇలాంటి విషయాల్లో అందరం కలిసికట్టుగా ముందుకు సాగుదాం. న్యాయమంటే కేవలం శిక్షలు విధించడం వరకే కాదు. బాధితుల జీవితానికి భరోసా కల్పించాలి. వారికి అవసరమైన రక్షణ, సమాజంలో తగిన గౌరవం కల్పించేలా చర్యలు తీసుకుని వారి బాల్యాన్ని తిరిగి పొందేలా చర్యలు ఉండాలని అన్నారు.

# 72 గంటల సమయం రేవంత్‌కు ఇస్తున్నాం ప్రిపేర్ అయ్యి రండి

మొదటి పేజీ తరువాయి

చంద్రబాబు బనకచర్ల ద్వారా తెలంగాణ రైతుల గొంతు కోస్తున్న మాట వాస్తవం. ఆంధ్రా ప్రయోజనాల కోసం రేవంత్ పనిచేస్తున్నారు. రాహుల్ గాంధీ వరంగల్ రైతు డిక్లరేషన్ ఒక్క హామీ అయినా నెరవేర్చారా రేవంత్. బురద చల్లడం పక్కకు వెళ్ళడం రేవంత్‌కు అలవాటు. రుణ మాఫీ 12 వేల కోట్లు మాత్రమే చేసి రైతులను మోసం చేశారు. రేవంత్ ప్రభుత్వం రైతులను, మహిళలను, కౌలు రైతులను మోసం చేసింది. 400 హామీలు ఇచ్చి ప్రభుత్వంలోకి వచ్చారు. ఒక్క కొత్త పథకం ప్రారంభించ లేదు. రేవంత్ రెడ్డి చేస్తున్న పని ఢిల్లీకి మూటలు పంపించడం. రాహుల్ గాంధీ, ప్రియాంక గాంధీల బ్యాంక్ బ్యాలెన్స్ పెంచడం తప్ప రేవంత్‌కు మరో పని లేదు. రేవంత్‌కు ఓట్లు వేయడానికి తెలంగాణ ప్రజలు సిద్ధంగా లేరు. చంద్రబాబు కోవర్టు రేవంత్. తెలంగాణలో జరుగుతుంది కోవర్టు పాలన'అని విమర్శించారు.

# కాంగ్రెస్ ప్రభుత్వంలోనే పేదలకు భరోసా - మంత్రి ఉత్తమ్

**న్యూస్ డెస్క్ ,05 జులై (కెరటం న్యూస్):** పేదలకు ఆహార భద్రత కల్పించడంలో భాగంగా రాష్ట్ర ప్రభుత్వం కొత్త రేషన్ కార్డులను మంజూరు చేస్తోంది. తాజాగా 4.76 లక్షల దరఖాస్తులకు ఆమోదం తెలిపింది. ఈనెల 14న సూర్యాపేట జిల్లా తుంగతుర్తి నియోజకవర్గ పరిధిలో నిర్వహించే సభలో సీఎం రేవంత్ రెడ్డి కొత్త రేషన్ కార్డుల పంపిణీని ప్రారంభిస్తారని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి ప్రకటించారు. ఈ నిర్ణయంతో రాష్ట్రవ్యాప్తంగా 11.30 లక్షల మంది పేదలకు ప్రయోజనం కలగనుంది. రేషన్‌కార్డుల మంజూరుతో నిరుపేదలకు భారీగా లబ్ధి చేకూరుతున్న నేపథ్యంలో ఈ విషయాన్ని ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లేందుకు సర్కారు సిద్ధమవుతోంది. ఈనెల 14వ తేదీన జరగనున్న సభలో కొత్త రేషన్‌కార్డుల పంపిణీని సీఎం ప్రారంభిస్తారు. ముఖ్యమంత్రి చేతుల మీదుగా లబ్ధిదారులకు రేషన్‌కార్డు పత్రాలను అందిస్తామని మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి తెలిపారు. కొత్త సభ్యుల చేరికలు.. నియోజకవర్గాల్లో మంత్రులు, ఎమ్మెల్యేల కొత్త రేషన్ కార్డులను అందిస్తామని మంత్రి ఉత్తమ్ వెల్లడించారు. కొత్త రేషన్‌కార్డుల మంజూరుతోపాటు ఇప్పటికే ఉన్న కార్డుల్లో కొత్త సభ్యులనూ చేర్చారు. అటు కొత్త కార్డులు, ఇటు పాత కార్డుల్లో చేరికలతో పేద కుటుంబాల సభ్యులు పెద్ద సంఖ్యలో రేషన్ పథకంలో లబ్ధిదారులయ్యారు. డైనమిక్ కీ రిజిస్టర్‌లోకి .. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి తుంగతుర్తి సభ కంటే ముందే డైనమిక్ కీ రిజిస్టర్–డీకెఆర్‌లో కొత్త లబ్ధిదారుల పేర్లు నమోదు చేయనున్నారు. డీకేఆర్‌లో నమోదు అయినవారికే రేషన్ లబ్ధి చేకూరుతుంది. ప్రభుత్వ క్యూఆర్ కోడ్‌తో స్మార్ట్ రేషన్ కార్డుల్ని జారీ చేయాలని నిర్ణయించగా.. టెండర్ల ప్రక్రియలో ఓ సంస్థ న్యాయస్థానాన్ని ఆశ్రయించింది. ప్రస్తుతానికి పేపర్ రూపంలోనే ఈ రేషన్ కార్డు ఇవ్వనున్నారు. ఈ నిర్ణయంతో ఆరు నెలల్లో 41 లక్షల మందికి రేషన్ ప్రయోజనం కలిగింది. రాష్ట్ర ప్రభుత్వం 2025 నుంచి కొత్త రేషన్‌కార్డులను మంజూరు చేస్తోంది. మే 23వ తేదీ వరకు మంజూరు చేసినవి తాజాగా ఆమోదం తెలిపినవి కలిపి ఆరు నెలల్లో మొత్తం 41,11,357 లక్షల మందికి ప్రయోజనం కలగనుంది.

# ప్రియుడితో మాట్లాడొద్దని చెప్పినందుకు భర్తని హత్య చేసిన భార్య..



**న్యూస్ డెస్క్ ,05 జులై (కెరటం న్యూస్):** ఈ మధ్య ప్రియుడి కోసం భార్యలు భర్తలను కృరంగా హతమారుస్తున్న ఘటనలు వెలుగు చూస్తేనే ఉన్నాయి. తాజాగా అలాంటి ఓ ఘటన తెలంగాణ రాష్ట్రం నారాయణపేట జిల్లా పరిధిలో చోటు చేసుకుంది. ప్రియుడితో మాట్లాడొద్దని చెప్పినందుకు కట్టుకున్న భర్తని దారుణంగా హత్య చేసింది ఓ భార్య. భర్తను హత్య చేసి ఆత్మహత్యగా క్రియేట్ చేసింది. తాగిన మత్తులో ఉన్న భర్త ఛాతిపై కూర్చొని గొంతు నులిమి కిరాతకంగా చంపింది.

కర్ణాటక సరిహద్దులోని నారాయణపేట జిల్లా(మండలం) కోటకొండ గ్రామానికి చెందిన అంజిలప్ప(32)కు ధన్వాడ మండలం రాంకిష్టయ్య పల్లి గ్రామానికి చెందిన రాధతో పదేళ్ల కిందట వివాహం జరిగింది. వీరికి ఇద్దరు పిల్లలు. బతుకుదెరువు నిమిత్తం హైదరాబాద్‌లోని బాచుపల్లికి వచ్చారు. ఇక్కడే కూలీ పనులు చేస్తూ జీవనం సాగిస్తున్నారు. ఇంతలో రాధ ధన్వాడకు చెందిన ఓ యువకుడితో వివాహేతర బంధం పెట్టుకుంది. ఈ విషయం కాస్త అంజిలప్పకు తెలిసింది. దీంతో ఆ యువకుడితో మాట్లాడొద్దని అంజిలప్ప రాధను మందలించాడు. దీంతో భర్తను అడ్డుతొలగించుకోవాలని భార్య ప్లాన్ వేసింది. గత నెల 23న తాగిన మత్తులో ఉన్న భర్త అంజిలప్ప పడుకుని ఉండగా.. గొంతు నులిమి హత్య చేసింది.

తన భర్త అకస్మాత్తుగా చనిపోయాడని అందరినీ నమ్మించింది. అంత్యక్రియల కోసం భర్త మృతదేహాన్ని గ్రామానికి తీసుకెళ్లింది. మృతదేహం గొంతుపై ఉన్న గాయాలు గమనించిన కుటుంబీకులు పోలీసులకు సమాచారం అందించారు. కేసు నమోదు చేసిన పోలీసులు మృతదేహానికి పోస్టుమార్టం నిర్వహించారు. పోస్టుమార్టంలో గొంతుపై ఒత్తిడి వేయడం వల్ల అంజిలప్ప మరణించినట్లు తేలింది. దీంతో భార్యను అనుమానించిన పోలీసులు.. తమదైన స్టైల్ లో విచారించారు. భర్తను తానే చంపినట్లు భార్య రాధ ఒప్పుకుంది. తన ప్రియుడితో మాట్లాడవద్దని మందలించడం వల్లనే చంపానని చెప్పింది. ఆమెను అరెస్ట్ చేసిన బాచుపల్లి పోలీసులు రిమాండ్ కు తరలించారు.

# టేబుల్ టెన్నిస్ ఆధునిక రోబోట్ ప్రారంభం



**ఖమ్మం స్పోర్ట్స్ ,05 జులై (కెరటం న్యూస్):** టేబుల్ టెన్నిస్ ప్రాంగణము నందు ఈరోజు అధునాతన రోబోట్ ను జిల్లా యువజన క్రీడ అధికారి తుంబూరి సునీల్ కుమార్ రెడ్డి టేబుల్ టెన్నిస్ ఫెడరేషన్ ఆఫ్ ఖమ్మం అధ్యక్షులు బాలసాని విజయ్ దాతలు పర్స ప్రసాద్ పర్స శశికళలు జిల్లా క్రీడా అధికారికి అందజేశారు ఈ అదునాతన పరికరం ద్వారా టేబుల్ టెన్నిస్ క్రీడకు ఉన్నత భవిష్యత్తు గల క్రీడాకారులు తయారు చేయవచ్చునని ఇలాంటి పరికరాన్ని తెలంగాణ రాష్ట్రంలో మొట్టమొదటిగా ఖమ్మం సర్దార్ పటేల్ నందు ఆవిష్కరించడం ఆనందంగా ఉందని జిల్లా క్రీడా అధికారి సునీల్ కుమార్ రెడ్డి దాతలు పర్సా ఆదిత్య, వోలెటీ శ్రీరామ్ అంకితలను అభినందించారు. కోచ్ సాంబమూర్తి మాట్లాడుతూ ఈ పరికరం దాదాపు లక్ష రూపాయల విలువగల ఈ పరికరం ద్వారా క్రీడాకారులు ఒక నిమిషానికి 120 బాల్స్ ఆడే సామర్థ్యం గలదని దీని ద్వారా అడ్వాన్స్ స్కిల్స్ నేర్చుకోవచ్చుని ఈ పరికరం తెలంగాణ రాష్ట్రంలో మన సర్దార్ పటేల్ స్టేడియంలో మాత్రమే ఆవిష్కరించడం జరిగిందని దీనిని సద్వినియోగపరచుకొని ఉన్నత క్రీడాకారులుగా ఎదగాలని కోరారు. ఈ పరికరాన్ని అందించిన పర్స ఆదిత్య, ఓలేటి శ్రీరామ అంకితలకు అభినందనలు తెలిపారు కార్యక్రమంలో టేబుల్ టెన్నిస్ సీనియర్ క్రీడాకారులు గౌరవ అధ్యక్షులు డాక్టర్ జొన్నలగడ్డ శశికుమార్ ఫెడరేషన్ ఆఫ్ టేబుల్ టెన్నిస్ ఖమ్మం ఉపాధ్యక్షులు ఉప్పల్ రెడ్డి గారు, జాయింట్ సెక్రటరీలు రెడ్డి సాయి శివ, షేక్ మజాహార్, పరిటాల చలపతి, పిట్టల కామేశ్వరి అనుమోలు రాజేష్, పర్స పవన్, అనంతరెడ్డి, ఫెడరేషన్ ఆఫ్ టేబుల్ టెన్నిస్ లీగల్ అడ్వైజర్ తన్నీరు లలిత, గౌరిశెట్టి భవ్య చందు వసంత నవ్య నాయుడు,స్వాతి రెడ్డి, మౌనిక ఉపేందర్, అజయ్ మనోహర్ సీనియర్ క్రీడాకారులు క్రీడాభిమానులు పాల్గొన్నారు.

# పీఎన్‌బీ కుంభకోణం కేసు.. నీరవ్ మోదీ సోదరుడు అమెరికాలో అరెస్ట్..!

మొదటి పేజీ తరువాయి



మోసపూరితంగా లెటర్స్ ఆఫ్ అండర్‌టేకింగ్ లను ఉపయోగించి పీఎన్‌బీకి సుమారు రూ.13,500 కోట్ల రుణాలను మోసం చేసిన నీరవ్ మోదీ, ఆయన మామ మెహుల్ చోక్సీ, నేహల్‌తో పాటు పలువురిని సీబీఐ, ఈడీ భారత్‌కు అప్పగించాలని కోరుతున్నాయి. నీరవ్ మోదీని అప్పగించేందుకు యూకే కోర్టు ఇప్పటికే ఆమోదం తెలిపింది. నీరవ్ మోదీ అప్పీళ్లు దాఖలు చేస్తూ వస్తుండడంతో భారత్‌కు తరలించే ప్రక్రియ ఆలస్యమవుతున్నది. ప్రస్తుతం లండన్ జైలులో ఉన్న నీరవ్‌ను 2019లో పరారీలో ఉన్న ఆర్థిక నేరగాడిగా ప్రకటించారు. ఈ ఏడాది ప్రారంభంలో భారత్ అభ్యర్థన మేరకు మెహుల్ చోక్సీని ఆంట్వెర్ప్‌లో అరెస్టు చేసినట్లు బెల్జియం ప్రభుత్వం తెలిపింది. చోక్సీ 2018లో భారతదేశం నుంచి పారిపోయారు. అప్పటి నుంచి ఆంటిగ్వా–బార్బుడాలో పౌరసత్వం తీసుకొని నివసిస్తున్నారు. నీరవ్ మోదీ ద్వారా వచ్చిన ఆదాయాన్ని మనీలాండరింగ్ చేయడంలో నేహల్ కీలక పాత్ర పోషించనట్లుగా ఈడీ, సీబీఐ దర్యాప్తులో వెల్లడైంది. నేరపూరితంగా ఆర్జించిన ఆదాయాన్ని దాచేందుకు, బదిలీ చేసేందుకు సహకరించినట్లుగా గుర్తించారు. నేహల్ మోదీ అప్పగింతపై విచారణ ఈ నెల 17న జరుగనున్నది. అయితే, ఈ సమయంలో నేహల్ బెయిల్ కోసం దరఖాస్తు చేసే అవకాశాలున్నాయి. అయితే బెయిల్‌ను వ్యతిరేకిస్తామని యూఎస్ ప్రాసిక్యూషన్ పేర్కొంది.

# మహిళలను కోటీశ్వరులను చేయడమే లక్ష్యంగా ముందుకు: డిప్యూటీ సీఎం భట్టి

**న్యూస్ డెస్క్ ,05 జులై (కెరటం న్యూస్):** ఈ సందర్భంగా డిప్యూటీ సీఎం మాట్లాడుతూ.. గత ప్రభుత్వం మహిళా సమాఖ్యలను పట్టించుకోలేదని విమర్శించారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక మహిళలను పెద్ద ఎత్తున ప్రోత్సహిస్తోందని.. ఇప్పటికే మహిళల అభివృద్ధి కోసం పలు కార్యక్రమాలు చేస్తున్నామని తెలిపారు. త్వరలో మరిన్ని కార్యక్రమాలు చేస్తామని వెల్లడించారు.

అవకాశాలు ఉన్న ప్రతీ దగ్గర వ్యాపారం కోసం మహిళా సమాఖ్యలకు ఇస్తామన్నారు. కోటి మంది మహిళలను కోటీశ్వరీమణులను చేయాలనే లక్ష్యంతో ప్రభుత్వం ముందుకు వెళ్తోందన్నారు. మహిళలకు ప్రభుత్వం అందిస్తున్న ప్రోత్సాహకాలను గ్రౌండ్ లెవెల్లో తెలిసేలా కార్యక్రమాలు చేస్తున్నామన్నారు. ఈనెల 10 నుంచి 16 వరకు రాష్ట్ర వ్యాప్తంగా వడ్డీలేని రుణాల చెక్కుల పంపిణీ కార్యక్రమాలు నిర్వహిస్తామని తెలిపారు. ఈ ప్రభుత్వం ప్రజలదన్నారు. కుటుంబ పెద్దలు ఆర్థికంగా ఎదిగేలా చేస్తే.. రాష్ట్రం అభివృద్ధి చెందుతుందన్నారు. మహిళా అభివృద్ధిలో తెలంగాణను రోల్ మోడల్‌గా తీర్చిదిద్దుతామని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క పేర్కొన్నారు.

**నష్టాల నుంచి లాభాల్లోకి ఆర్టీసీ: మంత్రి పొన్నం**

ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో ప్రజాపాలన ప్రభుత్వం ఏర్పడిన 48 గంటల్లో ఆర్టీసీలో మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం ప్రారంభించామని మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. మహాలక్ష్మి పథకం వల్ల ఆర్టీసీ మరోసారి బతికిందన్నారు. త్వరలోనే దాదాపు 200 కోట్ల మంది మహిళలు ఉచితంగా ప్రయాణం చేసిన రికార్డు నమోదు కాబోతుందని తెలిపారు. 6500 కోట్ల రూపాయల విలువైన ఉచిత ప్రయాణం నమోదు కాబోతుందని.. ఈ డబ్బులను ప్రభుత్వం ఆర్టీసీకి చెల్లించిందని చెప్పారు. తెలంగాణ వ్యాప్తంగా గ్రామ గ్రామాన సంబరాలు నిర్వహించాలని పిలుపిచ్చారు. ఈ మహాలక్ష్మి పథకం విజయవంతం కావడం కోసం డ్రైవర్లు, కండక్టర్‌లు చాలా కష్టపడుతున్నారని వారికి అభినందనలు తెలియజేశారు. ఆర్టీసీలో కొత్త బస్సులు కొనుగోలు చేస్తున్నామని.. కొత్త నియామకాలు చేస్తున్నామని చెప్పారు. మహిళలు ఎక్కడికి వెళ్లాలన్నా ఆర్టీసీ ఉచిత బస్సును వాడుకుంటున్నారన్నారు. ఆర్టీసీ నష్టాల నుంచి లాభాల్లోకి వెళ్తోందని మంత్రి ప్రభాకర్ వెల్లడించారు.

**మహిళల ఎదుగుదలే సమాజ ఎదుగుదల: మంత్రి సీతక్క**

కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చిన 24 గంటల్లోపే మహిళలకు ఉచిత బస్సు పథకం తెచ్చిందని మంత్రి సీతక్క అన్నారు. ఉచిత ప్రయాణమే కాదు మహిళలను బస్సులకు ఓనర్లను చేసిందన్నారు. మహిళల ఎదుగుదలనే సమాజ ఎదుగుదల అని చెప్పుకొచ్చారు. ఆ స్పూర్తితోనే తమ ప్రభుత్వం పని చేస్తోందని స్పష్టం చేశారు. గతంలో పావలా వడ్డీ రుణాలు ఇవ్వలేదని.. వడ్డీలేని రుణాలు కూడా ఇవ్వలేదని విమర్శించారు. ఆర్టీసీ బస్సుల్లో ప్రయాణించిన మహిళల అనుభవాలను తెలిపే పుస్తకం ఆవిష్కరించడం సంతోషకరమన్నారు. మండల సమాఖ్యలో ఉన్న మహిళల కోరికలు నెరవేరుతున్నాయన్నారు. మహిళా సంఘాల ద్వారా మహిళలు ఆర్థికంగా ఎదుగుతున్నారని మంత్రి చెప్పారు. ప్రభుత్వం ఏర్పాటైన నాటి నుంచి 25 వేల కోట్ల రుణాలను మహిళా సంఘాలు పొందాయని పేర్కొన్నారు. తీసుకున్న రుణాలను ఎప్పటికప్పుడు చెల్లిస్తుండడంతో బ్యాంకులు ఇబ్బందులు లేకుండా రుణాలు ఇస్తున్నాయన్నారు. మహిళలందరూ ఎల్లుండి నుంచి సంబరాలు చేయాలని.. ప్రభుత్వ ప్రోత్సహకాలన్నీ సంఘాలు ఉపయోగించుకోవాలని మంత్రి సీతక్క పిలుపునిచ్చారు.

# నిర్లక్ష్యం వద్దు.. డెడ్ లైన్ పెట్టుకుని పని చేయాలి: అధికారులకు మంత్రి ఆదేశం



**న్యూస్ డెస్క్ ,05 జులై (కెరటం న్యూస్):** సనత్‌నగర్, అల్వాల్, కొత్తపేట టిమ్స్ హాస్పిటల్స్, వరంగల్ మల్టీ సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్ నిర్మాణ పనులపై ఆరోగ్యశాఖ మంత్రి దామోదర రాజనర్సింహ సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సమీక్షలో ఆరోగ్యశాఖ సెక్రటరీతో పాటు, ఆ శాఖ ఇతర ఉన్నతాధికారులు, ఆర్ అండ్ బీ శాఖల ఉన్నతాధికారులు పాల్గొన్నారు. ఈ ఏడాది చివరికల్లా హాస్పిటళ్లను ప్రారంభించాలని సీఎం రేవంత్ రెడ్డి సూచించిన నేపథ్యంలో, పనుల పురోగతిపై మంత్రి సమీక్షించారు. హాస్పిటళ్ల సివిల్ వర్క్స్, ఎక్విప్‌మెంట్, డాక్టర్లు, సిబ్బంది నియామకం తదితర అంశాలపై అధికారులకు మంత్రి దిశానిర్దేశం చేశారు.

డెడ్ లైన్ పెట్టుకుని పని చేయాలి: మంత్రి

ఒక టైమ్‌లైన్ పెట్టుకుని అందరూ సమన్వయంతో పని చేయాలని, నిర్ణీత సమయంలో అన్ని పనులూ పూర్తి చేయాలని మంత్రి సూచించారు. హాస్పిటళ్లు ప్రారంభించిన రోజు నుండే వైద్య సేవలు అందుబాటులోకి రావాలని అధికారులను ఆదేశించారు. ఈ నాలుగు హాస్పిటళ్ల కోసం అధునాతన ఎక్విప్‌మెంట్ కొనుగోలు చేయాలని సూచించారు. ఎక్విప్‌మెంట్ కొనుగోలులో సంబంధిత డాక్టర్లు, టెక్నికల్ ఎక్స్‌పర్టుల అభిప్రాయాలను పరిగణలోకి తీసుకోవాలని మంత్రి ఆదేశించారు.

# 7 లక్షల రేషన్ కార్డులు తొలగించేందుకు కుట్ర : ఎమ్మెల్సీ కవిత

**న్యూస్ డెస్క్ ,05 జులై (కెరటం న్యూస్):** రాష్ట్రంలో మూడు నెలలు సన్న బియ్యాన్ని 7.24 లక్షల మంది రేషన్ కార్డుదారులు తీసుకోలేదని, ఆ కార్డుల రద్దుకు కాంగ్రెస్ సర్కార్ కుట్ర చేస్తోందని తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు, బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కవిత అనుమానం వ్యక్తం చేశారు. వర్షాకాలం నేపథ్యంలో జూన్‌లో మూడు నెలల రేషన్ పంపిణీ జరిగిందని తెలిపారు. అనివార్య కారణాలతో రేషన్ తీసుకోని 7.24 లక్షల కుటుంబాలు ఉన్నాయని, రేషన్ తీసుకోకపోవడాన్ని సాకుగా చూపుతూ ఏడు లక్షలకు పైగా కుటుంబాల రేషన్ కార్డులను తొలగించే ప్రయత్నాల్లో ప్రభుత్వం ఉందని ఆరోపించారు.

అర్హులైన వారందరికీ కార్డులు ఇస్తామని.. అవసరమైతే 30 లక్షల, 40 లక్షల కార్డులు ఇస్తామని ప్రకటనలు చేస్తున్నా.. కార్డుల ఏరివేతకు ప్రయత్నాలు చేయడం ఏమిటి? అని ప్రశ్నించారు. రేషన్ తీసుకోని వారికి మరోసారి బియ్యం పంపిణీ చేయాలని, రేషన్ కార్డుల రద్దు ప్రయత్నాలు వెంటనే విరమించుకోవాలని డిమాండ్ చేశారు. ఇప్పటికే రేషన్ కార్డుల కోసం దరఖాస్తు చేసుకున్న వారికి వెంటనే కొత్త రేషన్ కార్డులు ఇవ్వాలని డిమాండ్ చేశారు.

# అసెంబ్లీలో చర్చిద్దాం రా అంటే.. ప్రెస్ క్లబ్ కు రమ్మనడం ఏంటి?

– మంత్రి సీతక్క



**న్యూస్ డెస్క్ ,05 జులై (కెరటం న్యూస్):** రైతు సంక్షేమంపై సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో ఈ నెల8 వ తేదీన చర్చకు సిద్ధమని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ సీఎం రేవంత్ రెడ్డి కి సవాల్ చేశారు. ఈ కేటీఆర్ వ్యాఖ్యలపై మంత్రి సీతక్క కౌంటర్ ఇచ్చారు. ఈ మేరకు శనివారం ఆమె ప్రజాభవన్‌లో మీడియాతో మాట్లాడుతూ.. సీఎం రేవంత్ రెడ్డి విసిరిన సవాల్ కేటీఆర్‌కు అర్థం కానట్లు ఉందని విమర్శించారు.విదేశాలలో ఉన్న కేటీఆర్ తెలంగాణకు వచ్చినట్లు చెప్పేందుకే ప్రెస్ మీట్ పెట్టినట్టుగా ఉందన్నారు.. కేటీఆర్ గుర్తింపు సమస్యతో బాధపడుతున్నాడని, ఏం మాట్లాడుతున్నారో ఆయనకే అర్థం కావడం లేదన్నారు. అసెంబ్లీలో చర్చిద్దాం రా అంటే.. ప్రెస్ క్లబ్ కు రమ్మనడం ఏంటి? అని ప్రశ్నించారు.

ప్రజలు ఎమ్మెల్యేలుగా ఎన్నుకున్నది ప్రెస్‌క్లబ్‌లో చర్చించడానికి కాదని చెప్పారు. 72 గంటల డెడ్‌లైన్ అంటూ అర్థం పర్థం లేని మాటలు మాట్లాడుతున్నాడని మండిపడ్డారు. అయిన డెడ్ అయిన పార్టీ డెడ్ లైన్ పెట్టడం విడ్డూరంగా ఉందన్నారు. నీ డెడ్ లైన్ కోసం ఇక్కడ ఎవరు ఎదురుచూడటం లేదని చెప్పుకొచ్చారు. ప్రతిపక్ష నాయకుడు అసెంబ్లీ కి రాడా.. సమస్యల పై చర్చిద్దాం రా అంటే భయమెందుకు అని ధ్వజమెత్తారు. నీ సొంత చెల్లి.. నిన్ను నాయకునిగా గుర్తించడం లేదు.. అని విమర్శించారు. ప్రతిపక్ష హోదా ఉన్న మీ నాన్నను అసెంబ్లీకి రమ్మను చర్చిస్తాం.. అని సీతక్క మాజీ మంత్రి కేటీఆర్ వ్యాఖ్యలపై మండిపడ్డారు.

# పొన్నం.. రేవంత్‌తో రాజీనామా చేపించు: రామచందర్‌రావు

మొదటి పేజీ తరువాయి

మతం ఆధారంగా తాము ఏ బిల్లును ఆమోదించబోమని, అసెంబ్లీలో మా పార్టీ ఎమ్మెల్యేలు బీసీ బిల్లుకు మద్దతు తెలిపారన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఇస్తామని చెప్పిన జాబ్ క్యాలెండర్ ఎక్కడని ప్రశ్నించారు. ఏడాదికి రెండు లక్షల ఉద్యోగాలు ఇస్తామని చెప్పారు. అది ఇప్పుడు ఏమైందని రాంచందర్‌రావు కాంగ్రెస్‌ను నిలదీశారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఏ పనులు చేయలేక తప్పులను తమపై నెడుతున్నదన్నారు. ప్రతీసారి ఢిల్లీ వెళ్లినప్పుడు సీఎం రేవంత్ రెడ్డి ఏం చేస్తున్నారన్నారు. లోకల్ బాడీలకు కేంద్రం ఇచ్చిన నిధులు ఏం చేశారని రాంచందర్‌రావు ప్రశ్నించారు. పొన్నం ప్రభాకర్ సీఎం రేవంత్ రెడ్డి చేత రాజీనామా చేయించాలని, అప్పుడు బీసీని సీఎం చేస్తే, తన పదవిని రాజీనామా చేస్తానని రాంచందర్‌రావు సవాల్ విసిరారు.

# జీహెచ్‌ఎంసీ అధికారులపై కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి ఆగ్రహం



**న్యూస్ డెస్క్ ,05 జులై (కెరటం న్యూస్):** జూబ్లీహిల్స్ నియోజకవర్గ పరిధిలోని శ్రీకృష్ణనగర్ బస్తీలో శనివారం కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి పర్యటించారు. స్థానిక కమ్యూనిటీ హాల్ సీ బ్లాక్‌లో ఇళ్ల ముందు పెద్ద ఎత్తున మురుగునీరు పారుతుండటంతో తీవ్ర అసహనానికి గురయ్యారు. గత కొన్ని రోజులుగా ఇదే పరిస్థితి కొనసాగుతోందని స్థానికులు కిషన్‌రెడ్డి ఎదుట వాపోయారు. అధికారుల దృష్టికి తీసుకెళ్లినా పట్టించుకోవడం లేదని ఫిర్యాదు చేశారు. దీంతో తీవ్ర ఆగ్రహం చెందిన ఆయన.. జీహెచ్‌ఎంసీ కమిషనర్‌తో ఫోన్లో మాట్లాడారు. వెంటనే మురుగు సమస్యను పరిష్కరించాలని ఆదేశించారు. 'మీ ఇంటి ముందు ఇలా మురుగు ఉంటే ఒక్క నిమిషమైనా ఉండగలరా?' అని తీవ్రంగా మందలించారు. వారం రోజుల్లోగా సమస్యను పరిష్కరించాలన్నారు.

ఆదివారం 06 జులై 2025

# రోటరీ సేవలు ప్రపంచవ్యాప్తంగా చేపట్టాలి

**2024-25 సంవత్సర కాలంలో జిల్లా వ్యాప్తంగా రోటరీ క్లబ్ చేసిన సేవలు అభినందించ దగ్గ విషయం**

**డిస్టిక్ గవర్నర్ ఎలక్ట్ నామిని హరి హర ప్రసాద్**



**ఖమ్మం టౌన్ ,05 జులై (కెరటం న్యూస్):** ఖమ్మం గట్టయ్య సెంటర్ రోటరీ క్లబ్ లో 2024-25 రోటరీ క్లబ్ ఆఫ్ ఖమ్మం ప్రెసిడెంట్ నల్లమోతు రవీంద్రనాథ్ ఆధ్వర్యంలో నిర్వహించిన రోటరీ అవార్డ్స్ ప్రోగ్రానికి ముఖ్యఅతిథిలుగా డిస్టిక్ గవర్నర్ ఎలక్ట్ నామిని హరి హర ప్రసాద్, అసిస్టెంట్ గవర్నర్ శ్రీమహాలక్ష్మి, డిస్టిక్ సెక్రటరీ వైద్యనాథ్ లు పాల్గొని మాట్లాడారు. 2024-25 సంవత్సర కాలంలో జిల్లా వ్యాప్తంగా రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో చేపట్టిన సేవా కార్యక్రమాలను అభినందించారు. ప్రపంచవ్యాప్తంగా రోటరీ క్లబ్ సేవలు ప్రజలకు ఉపయోగపడేలా ఎన్నో సేవ కార్యక్రమాలు ముందు ముందు చేస్తుందని అన్నారు. గవర్నర్ నామిని ముళ్ళపూడి హరి హర ప్రసాద్ చేతుల మీదుగా క్లబ్ 2024 - 25 సంవత్సరంలో చేసిన ఉత్తమ సేవలకు గుర్తింపుగా ఉత్తమ క్లబ్ అవార్డు ఉత్తమ అధ్యక్షులు ఎన్ రవీందర్ నాథ్ కు, గత సంవత్సరంలో ఉత్తమ సేవలు అందించినందుకు పసుమర్తి రంగారావు కు లైఫ్ టైం ఎచ్చివ్మెంట్ అవార్డును ఇవ్వడమైనది. అనంతరం వచ్చిన అతిథులను శాలువాలతో సత్కరించారు. 2024-25 రోటరీ క్లబ్ ఆఫ్ ఖమ్మం ప్రెసిడెంట్ కు సంపూర్ణ మద్దతుగా తమ సేవలను అందించినందుకు ప్రతి ఒక్క సభ్యుడకు వ్యక్తిగత అవార్డులు ఇవ్వడం జరిగింది. ఈ కార్యక్రమంలో డిప్యూటీ గవర్నర్ దొడ్డపనేని సాంబశివరావు, అధ్యక్షులు వల్లభనేని రామారావు, గత సంవత్సరం అధ్యక్షులు ఎన్ రవీంద్రనాథ్, కార్యదర్శి హరి శ్రీనివాస్, సుధాకర్, పి నాగేశ్వరావు, పి రంగారావు, రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.



# మంత్రి పొంగులేటితో రెవెన్యూ జేఏసీ సమావేశం

**జేఏసీ చైర్మన్ లచ్చిరెడ్డి ఆధ్వర్యంలో రెవెన్యూ ఉద్యోగుల సమస్యలపై మంత్రికి విన్నపం**

**సానుకూలంగా స్పందించిన మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి**

**కృతజ్ఞతలు తెలిపిన రెవెన్యూ జేఏసీ నేతలు**



**హైదరాబాద్ బ్యూరో ,05 జులై (కెరటం న్యూస్):** కొత్తగా రానున్న గ్రామ పాలన అధికారుల(జీపీవోల) కోసం ప్రతి రెవెన్యూ గ్రామంలో కార్యాలయ స్థలాన్ని కేటాయించాలని విన్నవించారు. జూనియర్ అసిస్టెంట్ల నుండి నాయబ్ తహసీల్దార్ వరకు అన్ని స్థాయిల రెవెన్యూ ఉద్యోగుల విధులను పునఃసమీక్షించి, జాబ్ చార్ట్ రూపొందించి ఇవ్వాలని, జిల్లాలు, జోన్లలో జూనియర్ అసిస్టెంట్ల నుంచి నాయబ్ తహసీల్దార్ వరకు ఉద్యోగుల పరస్పర అంగీకార బదిలీల అంశాన్ని పరిగణనలోకి తీసుకోవాలని రాష్ట్ర రెవెన్యూ గృహ నిర్మాణ శాఖ సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి పొంగులటి శ్రీనివాస రెడ్డికి తెలంగాణ ఉద్యోగ జేఏసీ చైర్మన్ వి లచ్చిరెడ్డి విన్నవించారు. రెవెన్యూ శాఖలో జూనియర్ అసిస్టెంట్ నుంచి నాయబ్ తహసీల్దార్ వరకు ఉన్న రెవెన్యూ ఉద్యోగులు ఎదుర్కొంటున్న పలు సమస్యలు - పరిష్కరించాల్సిన అంశాలపై అభ్యర్థనకు సంబంధించి శనివారం తెలంగాణ ఉద్యోగుల జేఏసీ చైర్మన్, తెలంగాణ రెవెన్యూ సర్వీసెస్ అసోసియేషన్(టీజీఆర్ఎస్ఏ) గౌరవ అధ్యక్షులు వి.లచ్చిరెడ్డి ఆధ్వర్యంలో రెవెన్యూ జేఏసీ నాయకులు రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డితో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా రెవెన్యూ శాఖలో పనిచేస్తున్న ఉద్యోగులు ఎదుర్కొంటున్న పలు సమస్యలను రెవెన్యూ జేఏసీ బాధ్యులుగా మంత్రి పొంగులేటి దృష్టికి తీసుకెళ్లారు. ప్రధానంగా... , 2015 నుంచి మాజీ వీఆర్ఏల వారసుల కారుణ్య నియామకాలు నిలిచిపోయాయి. అర్హత కలిగిన అభ్యర్థులకు వీలైనంత త్వరగా కారుణ్య నియామకాలు చేపట్టాలని కోరారు. రెవెన్యూ ఉద్యోగులకు శిక్షణ ఇచ్చేందుకు ప్రతి జిల్లా కేంద్రంలో రెవెన్యూ అకాడమీలు ఏర్పాటుచేయాలనీ, అన్ని స్థాయిల రెవెన్యూ ఉద్యోగుల్లో ఉత్సాహాన్ని పునరుద్ధరించేందుకు క్రీడలు మరియు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించాలని కోరారు. రెవెన్యూ ఉద్యోగాల ఖాళీలకు అనుగుణంగా, అర్హత కలిగిన జూనియర్ అసిస్టెంట్ నుంచి నాయబ్ తహసీల్దార్ క్యాడర్ వరకు పనిచేస్తున్న ఉద్యోగులకు పదోన్నతులు కల్పించాలని మంత్రిని కోరారు. ప్రస్తుత జనాభా, అవసరాలు మరియు రెవెన్యూ శాఖకు అప్పగించిన విధుల ఆధారంగా సీసీఎల్ఏ కార్యాలయం, కలెక్టరేట్లు, డివిజన్ కార్యాలయాలు, తహసీల్దార్ కార్యాలయాల స్టాఫ్ ప్యాటెర్న్‌ను పునః సమీక్షించాలని కోరారు. సర్టిఫికెట్ల జారీ మరియు భూ వివాదాల కారణంగా పని భారం తీవ్రంగా పెరిగినందున ప్రతి మండలానికి 3 స్పెషల్ రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ పోస్టులు మంజూరు చేయాలని విజ్ఞప్తి చేశారు. పోలీసు సిబ్బందికి ఇస్తున్నట్టుగానే రెవెన్యూ ఇన్‌స్పెక్టర్లకు ద్విచక్ర వాహనాలు మరియు ఇంధన చార్జీలు ఇవ్వాలని మంత్రికి సూచించారు. విద్యుత్ చార్జీలు, ఇంటర్నెట్ ఖర్చులు, స్టేషనరీ ఖర్చులు పెరిగినందున ఆఫీస్ నిర్వహణ ఖర్చులను పెంచాలని అన్నారు. ప్రజాప్రతినిధులు మరియు వీఐపీల పర్యటనలు ఎక్కువవుతున్న నేపథ్యంలో తహసీల్దార్ కార్యాలయాలకు ప్రోటోకాల్ మరియు కంటింజెన్సీ ఖర్చులను మంజూరు చేయాలని కోరారు. తహసీల్దార్ కార్యాలయాల్లో మహిళా ఉద్యోగులు మరియు సందర్శకుల కోసం ప్రత్యేక వాష్‌రూంలు ఏర్పాటు చేయాలనీ, అవసరమైన అన్ని తహసీల్దార్ కార్యాలయాల్లో తగు మౌలిక సదుపాయాలను కల్పించాలి. అవసరమైన చోట్ల కొత్త భవనాలు నిర్మించాలనీ, భూభారతి చట్టం-2025ను సమర్థవంతంగా అమలు చేయడానికి గ్రామ పాలన అధికారుల నియామక ప్రక్రియను త్వరగా పూర్తి చేయాలనీ, రెవెన్యూ మరియు ఇతర చట్టాలలో వస్తున్న మార్పులను ఉద్యోగులు సులభంగా అర్థం చేసుకొని, సమర్థంగా విధులు నిర్వహించేందుకు వారందరికీ క్రమం తప్పకుండా ఓరియంటేషన్ శిక్షణలు అందించాలని కోరారు. ఈ విజ్ఞప్తులను పరిగణనలోకి తీసుకొని, పరిపాలనా వ్యవస్థ సాఫీగా కొనసాగేలా చర్యలు తీసుకోవాలని మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి, రెవెన్యూ ప్రిన్సిపల్ సెక్రటరీ డిఎస్ లోకేష్ కుమార్ కు జైస్ చైర్మన్ వి లచ్చిరెడ్డి ఆధ్వర్యంలో వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రభుత్వ ఉద్యోగులకు అండగా ఉంటుందని ఉద్యోగులకు తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వానికి మధ్య పేగు బంధం ఉందని మంత్రి తెలిపారు ఉద్యోగులను అన్ని విధాలుగా ఆదుకునేందుకు కృషి చేస్తున్నామని అని తెలిపారు ఈ సందర్భంగా మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డికి రెవెన్యూ ప్రిన్సిపల్ సెక్రటరీ డిఎస్ లోకేష్ కుమార్ కు ఉద్యోగ చైర్మన్ వి లచ్చిరెడ్డి ఆధ్వర్యంలోని రెవెన్యూ జేఏసీ బాధ్యులు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ తహసీల్దార్ అసోసియేషన్ రాష్ట్ర విమెన్ ప్రెసిడెంట్ రాధ, తెలంగాణ తాసిల్దార్స్ అసోసియేషన్ అద్యక్ష, కార్యదర్శులు ఎస్ రాములు, రమేష్ పాక, పూల్ సింగ్ చౌహాన్, టి జి ఆర్ ఎస్ ఏ రాష్ట్ర మహిళా అధ్యక్షురాలు సుజాతాచౌహాన్, టి జి ఆర్ ఎస్ ఏ, సిసిఎల్ఏ యూనిట్ ప్రెసిడెంట్ రాంబాబు, సెక్రటరీ కృష్ణ చైతన్య, తెలంగాణ రెవిన్యూ సర్వీస్ అసోసియేషన్ అధ్యక్షులు బాణాల రామ్ రెడ్డి ప్రధాన కార్యదర్శి వి బిక్షం, తెలంగాణ తహసిల్దార్స్ అసోసియేషన్ అసోసియేట్ ప్రెసిడెంట్ చిల్లా శ్రీనివాస్, గ్రామ పాలన అధికారుల సంక్షేమ సంఘం తెలంగాణ రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు గరికె ఉపేంద్రరావు, వి లక్ష్మీ నరసింహులు తదితరులు పాల్గొన్నారు.

# ఉద్యోగ విరమణ బకాయిలు సత్వరం చెల్లించాలి

**పెన్షనర్ల సంఘ అధ్యక్షులు పరిశ పుల్లయ్య**



**ఖమ్మం టౌన్ ,05 జులై (కెరటం న్యూస్):** ఉద్యోగవిరమణచేసిన పెన్షనర్లకు చెల్లించాల్సిన మొత్తాలు సత్వరం చెల్లించాలని రాష్ట్ర ప్రభుత్వ పెన్షనర్ల సంఘం, ఖమ్మం జిల్లా అధ్యక్షులు పరిశపుల్లయ్య రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శనివారం నాడు స్థానిక కృషిభవన్ లో జరిగిన పెన్షనర్ల సమావేశానికి అధ్యక్షత వహించిన పరిశపుల్లయ్య మాట్లాడుతూ ఉద్యోగ విరమణ చేసి సంవత్సరం గడచినా, బకాయిలు చెల్లించటంలో ప్రభుత్వ వైఫల్యం కారణంగా పలువురు పెన్షనర్లు మరణించారని, ఇప్పటికైనా పెన్షనర్లకు చెల్లించాల్సిన బకాయిలు సత్వరం చెల్లించాలని కోరారు.రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటికైనా పెన్షనర్లకు చెల్లింపులు ప్రారంభించకపోతే రాబోయే రోజుల్లో పెన్షనర్ల ఉద్యమాలకు సిద్దం కావాలని రాష్ట్ర ప్రభుత్వ పెన్షనర్ల సంఘం అధ్యక్షులు పరిశపుల్లయ్య పిలుపిచ్చారు.కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ విధానాలు పెన్షనర్లను ఆందోళనకు గురిచేస్తున్నాయని, ఐక్యతతో సాధించిన హక్కులకు ప్రభుత్వం తిలోదకాలు ఇచ్చేయత్నాలను తిప్పికొట్టాలని ఉపాధ్యాయ సంఘ పూర్వ ప్రధాన కార్యదర్శి విమనోహరరాజు పెన్షనర్లను కోరారు. జిల్లాలో రాష్ట్ర ప్రభుత్వ పెన్షనర్ల సంఘం చేస్తున్న కృషి తో పలువురు పెన్షనర్లు సకాలంలో పెన్షన్ తీసుకుంటున్నారని, పెన్షనర్లను ఎప్పటికప్పుడు చైతన్యం చేస్తున్నట్టు ప్రధానకార్యదర్శి రాయలరవికుమార్ తెలిపారు. సమావేశంలో భాస్కరాచారి,పి. వీరభద్రరావు, మేరిఏసుపాదం, పివిఆర్కేప్రసాద్, లక్ష్మి సుజాత, అంజలి, వెంకటేశ్వర్లు, హుస్సేన్, రవీంద్ర, నాగప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

# తొలి ఏకాదశి శుభాకాంక్షలు

**-మాజీ ఎంపీ నామ**



**ఖమ్మం బ్యూరో ,05 జులై (కెరటం న్యూస్):** తొలి ఏకాదశి పర్వదినం సందర్భంగా తెలుగు ప్రజలందరికీ హృదయపూర్వక శుభాకాంక్షలు తెలియజేస్తున్నానని బిఆర్ఎస్ మాజీ లోక్ పక్ష నేత, ఖమ్మం మాజీ ఎంపీ నామ నాగేశ్వరరావు శనివారం నాడు మీడియా కు ప్రకటన విడుదల చేసారు. ఇది తెలుగు సంప్రదాయాల్లో ముఖ్యమైన ఆధ్యాత్మిక పర్వదినమని, పవిత్రతకు ప్రతీకగా పరిగణించబడే ఈ రోజున ఉపవాస దీక్ష, ధ్యానాలు చేయడం ద్వారా మనస్సుకు ప్రశాంతతను కలుగుతుందన్నారు. ఈ రోజు "పేలాల పండుగ"గా కూడా ప్రసిద్ధి చెందిందని, మన ఆచారాలను పాటిస్తూ సత్యము, శాంతి, సేవా మార్గంలో ముందుకు సాగాలని ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ప్రతి ఒక్కరిలో ధర్మబద్ధమైన ఆలోచనలు, సత్సంకల్పాలు కలిగించాలని, ఆధ్యాత్మిక చింతనతో పాటు సమాజంలో సేవా భావనను పెంపొందించుకోవాలన్నారు. కుటుంబ సమేతంగా ప్రత్యేక పూజ కార్యక్రమాలు చేసి, సంస్కృతి, సంప్రదాయాల పట్ల యువతలో అవగాహన పెంపొందించాలన్నారు. భగవంతుడి అనుగ్రహంతో ప్రతి ఒక్కరికీ ఆరోగ్యాన్ని, ఐశ్వర్యాన్ని, ఆనందం లభించాలని ఆకాంక్షించారు.

# మొహర్రం త్యాగానికి, స్ఫూర్తికి ప్రతీక

**-మాజీ ఎంపీ నామ**



**ఖమ్మం బ్యూరో ,05 జులై (కెరటం న్యూస్):** మొహర్రం త్యాగానికి, స్ఫూర్తికి ప్రతీక అని బిఆర్ఎస్ మాజీ లోక్ పక్ష నేత, ఖమ్మం మాజీ ఎంపీ నామ నాగేశ్వరరావు పేర్కొన్నారు. విశ్వాసం, న్యాయం కోసం మహ్మద్ ప్రవక్త మనవడు హజ్రత్ ఇమామ్ హుస్సేన్ చేసిన బలిదానాన్ని గుర్తు చేసుకోవడమే మొహర్రం ప్రత్యేకత అని స్పష్టం చేశారు. మానవజాతిలో త్యాగం, శాంతి, న్యాయం వంటి ఆదర్శాలు మనలో ఎప్పటికీ స్ఫూర్తి నింపుతాయని తెలిపారు. మంచితనం, ధర్మబద్ధత, సేవా మార్గాన్ని గుర్తు చేసుకునే సందర్భమే మొహర్రం అని అభిప్రాయపడ్డారు. ఇమామ్ హుస్సేన్ లాంటి మహోన్నత వ్యక్తుల త్యాగాల నుంచి నేటి తరాలు నేర్చుకోవలసినవి ఎంతో ఉన్నాయని నామ పేర్కొన్నారు. ఈ రోజు త్యాగాన్ని మాత్రమే కాక, ఆ త్యాగం వెనుక ఉన్న విలువలను గుర్తు చేసుకుంటేనే నిజమైన అర్థం దక్కుతుందని అభిప్రాయపడ్డారు.

# సర్వే పైకం చెల్లించాలి - టిఎస్ యుటిఎఫ్



**ఖమ్మం ఎడ్యుకేషన్ ,05 జులై (కెరటం న్యూస్):** సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వేలో పాల్గొన్న ఉపాధ్యాయులకు హాజరు ధృపత్రములు మంజూరు చేయాలని, సర్వే పైకం చెల్లించాలని కోరుతూ టిఎస్ యుటిఎఫ్ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో మున్సిపల్ కార్పొరేషన్ ఉప కమిషనర్ అనిల్ కుమార్ కు శనివారం వినతిపత్రం ఇవ్వనైనది. ఈ సందర్భంగా జిల్లా ప్రధాన కార్యదర్శి పారుపల్లి నాగేశ్వరరావు మాట్లాడుతూ సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వే పూర్తి చేసి ఏడు నెలలు అయినా ఈరోజు వరకు అటెండెన్స్ సర్టిఫికెట్స్ మంజూరు చేయకపోవడం బాధాకరమని, సర్వే పైకం చెల్లించకపోవడం దారుణమని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. వెంటనే అటెండెన్స్ సర్టిఫికెట్స్ మంజూరు చేస్తూ, సర్వే పైకం చెల్లించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా నాయకులు బుర్రి. వెంకన్న, వల్లంకొండ. రాంబాబు, షేక్.ఉద్దండ్ షరీఫ్, నార్ల. నవీన్ కుమార్, నాగేశ్వరరావు, సువర్ణ ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

# భాగం ఫౌండేషన్ ఆర్థిక సాయం



**బోనకల్ ,05 జులై (కెరటం న్యూస్):** ఇటీవల తాటి చెట్టు పై నుండి ప్రమాదవశాత్తు కిందపడి మరణించిన గీత కార్మికుడి కుటుంబానికి భాగం సేవా ఫౌండేషన్ నిర్వాహకులు భాగం రాకేష్ రూ . 5 వేలు ఆర్థిక సాయమందించారు. మండల పరిధిలోని ఆళ్లపాడు గ్రామానికి చెందిన మంద రాములు ఇటీవల ప్రమాదవశాత్తు తాటిపైనుండి కిందపడి మరణించిన ఘటన విధితమే. మృతుడికి ఇద్దరు కుమార్తెలు, కుమారుడు ఉన్నారు. ఆర్థిక సాయమందించిన అనంతరం ఫౌండేషన్ సభ్యులు భాగం రాధాకృష్ణ మాట్లాడుతూ మృతుడి కుటుంబంలోని చిన్నారుల చదువుల అవసరాల నిమిత్తం సహాయ సహకారాలు అందిస్తామన్నారు. మరికొందరు దాతలు ముందుకొచ్చి ఈ కుటుంబంలోని చిన్నారుల చదువుకు భరోసానివ్వాలని కోరారు. ఈ కార్యక్రమంలో భాగం సేవా ఫౌండేషన్ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

# నిరుపేద వైద్య విద్యార్థికి కొండంత భరోసా.. డా.బాబురావు అమృత హాస్పిటల్, కొత్తగూడెం

**హాస్టల్ ఫీజు కట్టలేక ఒక్క పూట తిని రోజంతా కడుపుమాడ్చుకుంటున్న వైనం**
**దీనావస్థలో వైద్య విద్యను కొనసాగిస్తున్న విద్యార్థి నంద్ర సాయి కిరణ్**
**సాయికిరణ్‌కు బాసటగా నిలిచిన అమృత మల్టీ స్పెషాలిటీ హాస్పటల్ వైద్యులు డాక్టర్ బాబురావు**
**మహా ఆది సేవ సమితి సభ్యులైన స్నేహితుల ద్వారా విషయం తెలుసుకుని విద్యార్థికి చేయూత**
**కళాశాల హాస్టల్ ఫీజు నిమిత్తం రూ.27వేలు ఆర్థిక సహాయం**
**కాకతీయ మెడికల్ కళాశాల లో మహాఆది సేవ సమితి సభ్యులైన మిత్రులు సాయికిరణ్ కు అందజేత**
**క్లిష్ట పరిస్థితులలో అండగా నిలిచిన డా. బాబురావుకు కృతజ్ఞతలు తెలిపిన సాయి కిరణ్**



**కొత్తగూడెం ,05 జులై (కెరటం న్యూస్):** పేదల వైద్యునిగా... ఎంతో మంది అభాగ్యులకు ఉచితంగా వైద్య సదుపాయాలు సైతం అందించడంతో పాటుగా ఆపదలో ఉన్నారని ఎవరు తలుపుతట్టినా నేనున్నా అనే భరోసా ఇస్తూ.. తనవంతు చేయూత అందిస్తూ.. అందరిచేతా మనసున్న మహారాజుగా పేరున్న వైద్యులు అమృత మల్టీ స్పెషాలిటీ ఎమర్జెన్సీ అండ్ క్రిటికల్ కేర్ హాస్పటల్ డాక్టర్ బాబురావు. కరోనా లాంటి విపత్కర సమయంలో తన ప్రాణాలను సైతం లెక్కచేయకుండా వేలాది మందికి ప్రాణబిక్ష పెట్టిన ఆయన.. అమృత హాస్పటల్ ఆధ్వర్యంలో ఎన్నో మెడికల్ క్యాంపులు సైతం నిర్వహిస్తూ.. మారుమూల ఏజెన్సీ ప్రాంతాల్లో నిరసించే ఆదివాసీలకు, గిరిజనులకు కార్పొరేట్ స్థాయి వైద్యాన్ని సైతం ఉచితంగా వారికి అందజేస్తున్నారు. ఈ నేపథ్యంలో అర్థాకలితోనే వైద్య విద్యను అభ్యసిస్తూ.. ఒక్కపూట భోజనంతోనే సరిపెట్టుకుంటూ మిగతా రోజంతా పస్తులుంటూ ఎంబీబీఎస్ చదువుతున్న నిరుపేద విద్యార్థికి బాసటగా నిలిచారు డాక్టర్ బాబురావు. హాస్టల్ ఫీజు కట్టలేక ఒక్క పూట తిని రోజంతా కడుపుమాడ్చుకుంటున్న విద్యార్థికి రూ.27వేలు ఆర్థిక సాయం అందజేసి తన దాతృత్వాన్ని చాటుకున్నారు. ఇందుకు సంబంధించి వివరాల్లోకి వెళ్తే.. ఖమ్మం జిల్లా ఖమ్మం రూరల్ మండల పరిధిలోని ఎం.వెంకటాయపాలెం గ్రామానికి చెందిన నంద సాయి కిరణ్ వరంగల్‌లోకి కాకతీయ మెడికల్ కాలేజీలో ఎంబీబీఎస్ మూడో సంవత్సరం చదువుతున్నాడు. సాయికిరణ్ తమ్ముడు సాయి కార్తీక్ గుజరాత్‌లోని ఎన్ఐటీ సూరత్‌లో ఎమ్మెస్సీ కెమిస్ట్రీ చదువుతున్నాడు. సాయి కిరణ్ తల్లిదండ్రులు రోజూ కూలీకి వెళ్లనిదే పూటగడవని పరిస్థితి. దీంతో తన కుమారుడ్కెన సాయికిరణ్‌ను మంచి స్థాయిలో చూడాలన్న కోరిక ఉన్నా.. అటు హాస్టల్‌కు ఇటు కాలేజీ ఫీజులు కట్టలేని పరిస్థితి. సాయి కిరణ్ 2022 ఫిబ్రవరి నుంచి డిసెంబర్ 2024 వరకు కళాశాల హాస్టల్ ఫీజు రూ.27000 చెల్లించాల్సి ఉంది. దీంతో ఒక పూట తింటూ మిగతా రోజంతా ఖాళీ కడుపుతోనే జీవనం సాగిస్తున్నాడు. ఈ క్రమంలోనే యూనివర్సిటీ పరీక్షలు ఉన్న నేపథ్యంలో ఈ ఫిజు చెల్లిస్తేనే హాల్‌టికెట్ పొందే అవకాశం ఉంది. ఈ విషయం తన స్నేహితులైన డాక్టర్ మాధవి డీఎం – కార్డియాలజి, డాక్టర్ వరకల మహేందర్ ఎమర్జెన్సీ ఫిజిషియన్, డాక్టర్ సీనపెల్లి విజయ్ కుమార్ ఎండి పాథాలజీ, ఎన్.వీ రత్నం పర్ఫుజనిస్ట్ (వరంగల్) ద్వారా తెలుసుకున్న అమృత మల్టీ స్పెషాలిటీ ఎమర్జెన్సీ అండ్ క్రిటికల్ కేర్ హాస్పటల్ అధినేత డాక్టర్ బాబురావు సాయికిరణ్ పరిస్థితి చూసి చలించిపోయారు. నేనున్నానంటూ.. నిరుపేద విద్యార్థికి భరోసానిస్తూ.. తనవంతుగా రూ.27,000 హాస్టల్ ఫీజు కట్టేందుకు ఆర్థిక సాయం తన స్నేహితుల ద్వారా అందజేశారు. కాగా డాక్టర్ బాబురావు చూపిన దాతృత్వానికి, తన క్లిష్ట పరిస్థితుల్లో అమూల్యమైన సహాయం పంపి ఆదుకున్నందుకు పదే పదే కృతజ్ఞతలు ధన్యవాదాలు తెలిపాడు. ఆయనతో పాటు పలువురు ప్రముఖులు ప్రశంసలు అందించారు. ఆపదలో ఆదుకోవాలన్న గొప్ప మనసు కలిగి ఉండడం.. ఎంతో మందికి తనవంతు చేయూత అందిస్తూ.. వైద్యం పరంగా కూడా బాసటగా నిలుస్తున్న డాక్టర్ బాబురావును మనసున్న మహారాజుగా అభ్యుదయ వాదులు, ప్రకృతి ప్రేమికులు, సమాజసేవకులు అభినందించారు.




# రాక్రేలను కలపడానికి, బాలాసాహెబ్ చేయలేనిది ఫడ్నవీస్ చేశారు..

**ఇంటర్నెట్ డెస్క్, ,05 జులై (కెరటం న్యూస్):** 20 ఏళ్లుగా శత్రువుగా ఉన్న బంధవులు ఉద్ధవ్ ఠాక్రే, రాజ్ ఠాక్రేలు ఒకే వేదికను పంచుకుంటూ, తాము కలిసిపోయినట్లు ప్రకటించారు. శివసేన(యూబీటీ), మహారాష్ట్ర నవనిర్మాణ్ సేన(ఎంఎన్ఎస్) అధ్యక్షుల కలయిక రాజకీయంగా ప్రాధాన్యత సంతరించుకుంది. బాల్ ఠాక్రే కూడా చేయలేని పనిని సీఎం దేవేంద్ర ఫడ్నవీస్ చేశారని రాజ్ ఠాక్రే అన్నారు. వివాదాస్పద త్రిభాష సూత్రంపై వ్యతిరేకత వ్యక్తం చేస్తూ, మరాఠీ ప్రజలపై హిందీ రుద్దే ప్రయత్నం చేస్తున్నారంటూ ప్రభుత్వంపై విమర్శలు చేసిన వీరిద్దరిని, హిందీ వ్యతిరేకత కలిపింది. ప్రాథమిక పాఠశాలల్లో హిందీని మూడో భాషగా తప్పనిసరి చేయాలనే నిర్ణయాన్ని ఫడ్నవీస్ ప్రభుత్వం వెనక్కి తీసుకోవాల్సి వచ్చింది.

'ఆవాజ్ మరాఠీ చా' (మరాఠీ స్వరం) విజయోత్సవ ర్యాలీని ఉద్దేశించి రాజ్ మాట్లాడుతూ..“మహారాష్ట్ర రాజకీయాలు, పోరాటాల కన్నా గొప్పదది. నేడు 20 ఏళ్ల తర్వాత ఉద్ధవ్, నేను కలిసి వచ్చాము. మా ఇద్దరి కలిపేందుకు బాలాసాహెబ్ ఠాక్రే చేయలేనిది, దేవేంద్ర ఫడ్నవీస్ చేశారు.” అంటూ విమర్శలు గుప్పించారు. బృహన్ ముంబై మున్సిపల్ కార్పొరేషన్ ఎన్నికలతో సహా ముంబై పౌర సంస్థకు జరిగే ఎన్నికల్లో తాము ఇద్దరం కలిసి పోటీ చేస్తామని, మేము కలిసి ఉండటానికి కలిసి వచ్చాము అని ఉద్ధవ్ అన్నారు.

చివరిసారిగా వీరిద్దరు 2005 ఎన్నికల సమయంలో ఒకే వేదికను పంచుకున్నారు. ఆ తర్వాత రాజ్ ఠాక్రే శివసేన నుంచి బయటకు వచ్చి, 2006లో ఎంఎన్ఎస్ పార్టీని ప్రారంభించారు. ఇటీవల మహారాష్ట్ర అసెంబ్లీ ఎన్నికల్లో, శివసేన(యూబీటీ)కి 20 సీట్లు రాగా, ఎంఎన్ఎస్ ఒక్కసీటు కూడా గెలవలేకుండా పోయింది. అయితే, హిందీని మూడో భాషగా చేస్తూ ఫడ్నవీస్ సర్కార్ నిర్ణయం తీసుకుంది. అయితే, దీనిపై వ్యతిరేకత రావడంతో ఆ ఉత్తర్వులను రద్దు చేసింది. ఈ నేపథ్యంలో హిందీ భాష వీరిద్దరిని కలిపింది.



త్రిభాషా సూత్రంపై ముంబైని మహారాష్ట్ర నుంచి వేరు చేసే ప్రణాళిక చేస్తున్నారంటూ రాజ్ ఠాక్రే బీజేపీ ప్రభుత్వంపై విమర్శలు గుప్పించారు. “నాకు హిందీ పట్ల ఎలాంటి వ్యతిరేకత లేదు, ఏ భాష కూడా చెడ్డది కాదు. వారు మాపై హిందీని రుద్దే ప్రయోగంతో ప్రారంభించారు. మనం దానిని వ్యతిరేకించకపోతే, వారు ముంబైని మహారాష్ట్ర నుండి వేరు చేసేవారు” అని ఆరోపించారు.

బీజేపీ నేత ఎల్‌కే అద్వానీ మిషనరీ పాఠశాలలో చదువుకున్నాడని, ఆయన హిందుత్వం గురించి ఎవరూ ఎలాంటి సందేహాలు లేవనెత్తలేదని చెప్పాడు. “మా పిల్లలు ఇంగ్లీష్ మీడియం పాఠశాలల్లో నేర్చుకున్నారని వారు అంటున్నారు. ఫడ్నవీస్ ఇంగ్లీష్ మీడియం పాఠశాలలో చదివి మహారాష్ట్ర ముఖ్యమంత్రి అయ్యారు. నా తండ్రి శ్రీకాంత్ థాకరే, అంకుల్ బాలాసాహెబ్ థాకరే ఇంగ్లీష్ మీడియం పాఠశాలలో చదువుకున్నారు. మరాఠీ పట్ల వారికున్న ప్రేమ గురించి ఎవరైనా ప్రశ్నించగలరా? రేపు నేను హిబ్రూ కూడా నేర్చుకుంటాను. మరాఠీ పట్ల నాకున్న గర్వం గురించి ఎవరైనా ప్రశ్నించగలరా?” అని రాజ్ ఠాక్రే అడిగారు.

# బీకాం లో ఆర్జేసి విద్యార్థి కి ఖమ్మం ఫస్ట్



**ఖమ్మం ఎడ్యుకేషన్ ,05 జులై (కెరటం న్యూస్):** కాకతీయ యూనివర్సిటీ విడుదల చేసిన డిగ్రీ ఫలితాల్లో ఖమ్మం ఆర్జేసి కళాశాల విద్యార్థి మానస ప్రతిభ కనబరిచి 8.62 సీజీపీఏ పాయింట్లతో బీకాం లో ఖమ్మం ఫస్ట్ సాధించినట్లు కళాశాల ఛైర్మన్ గుండాల కృష్ణ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తమ కళాశాల విద్యార్థులు గతంలో పలువురు వివిధ రంగాల్లో ఉన్నత మైన స్థితి లో స్థిర పడ్డారని తెలిపారు. అదేవిధంగా ఇంజనీరింగ్ విద్యార్థులకు దీటు గా క్యాంపస్ ప్లేస్ మెంట్ లలో విజయం సాధించి ఉద్యోగాలు సాధించడం గర్వకారణం అన్నారు. గతం లో కూడా బీకాం లో ఖమ్మం ఫస్ట్ సాధించినట్లు తెలిపారు.దీనికి తమ కళాశాల విద్యార్థులపై అధ్యాపకుల పర్యవేక్షనే కారణమని తెలిపారు. విద్యార్థులు వుత్తమ ఫలితాలు సాధించడానికి కృషి చేసిన అధ్యాపకులను ఆయన ఈ సందర్భంగా అభినందించారు. భవిష్యత్లో కూడా తమ విద్యార్థులు ఉన్నత శిఖరాలు అధిరోహించే లా యాజమాన్యం కార్యా చరణ రూపొందించిందని వివరించారు. అనంతరం మానస ను అభినందించారు.ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్ ఎ.లింగయ్య అధ్యాపకులు పాల్గొన్నారు.

# నేడు నియోజకవర్గంలో మంత్రి పొంగులేటి పర్యటన



**కొత్తగూడెం ,05 జులై (కెరటం న్యూస్):** భద్రాద్రి జిల్లాలో ఆదివారం రాష్ట్ర రెవెన్యూ, గృహనిర్మాణ, సమాచార పౌరసంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి పర్యటన నిర్వహించనున్నారు. కొత్తగూడెం నియోజకవర్గంలో రెవిన్యూ రాష్ట్ర ప్రభుత్వం పేదోడి సొంత ఇంటి కలలు నెరవేర్చే దిశగా ప్రవేశపెట్టిన ఇందిరమ్మ ఇళ్ల పథకంలో భాగంగా చుంచుపల్లి, లక్ష్మీదేవిపల్లి, సుజాతనగర్, పాల్వంచ మండలాల ఇందిరమ్మ ఇండ్ల లబ్దిదారులకు మరియు ఎస్ఆర్ఆటి, మాయాబజార్, వనమా కాలని నిర్వాసితులకు ఇంటి స్థలాల లబ్ధిదారులకు ఆదివారం జిల్లా కేంద్రంలోని కొత్తగూడెం క్లబ్ లో ఉదయం 11 గంటలకు భారీ స్థాయిలో ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులకు మంజూరు పత్రాల పంపిణీ కార్యక్రమంలో పాల్గొంటారు. పాల్గొననున్నారు. అనంతరం లక్ష్మీదేవిపల్లి మండలంలోని సీతారాంపురం, చింతపెంటిగూడెం లలో హైలెవల్ బ్రిడ్జి నిర్మాణానికి శంకుస్థాపన చేస్తారు. జిల్లా అధికారులు కార్యక్రమాలకు అవసరమైన భద్రతా మరియు సాంకేతిక ఏర్పాట్లను పూర్తిచేసినట్లు తెలిపారు.

# శ్రీ గ్లోబల్ హై స్కూల్ లో వికసించిన మరో విద్యా కుసుమం



**చింతకాని ,05 జులై (కెరటం న్యూస్):** చింతకాని మండలంలో ఉన్నటువంటి శ్రీ గ్లోబల్ హై స్కూల్ నాగులవంచలో చదువుతున్నటువంటి ఎం.డి సోహెల్ 2025-26 విద్యా సంవత్సరం ప్రవేశం కోసం జరిగినటువంటి ట్రిపుల్ ఐటీ క్యాంపస్ జాబితాలో సీటును కైవసం చేసుకోవడం జరిగింది. ట్రిపుల్ ఐటీ ప్రవేశాల కోసం ఈసారి 1500 సీట్లతో పాటు ఈ ఏడాది కొత్తగా మహబూబ్నగర్ లో ఏర్పాటు చేసిన క్యాంపస్ తో సహా మొత్తం 1680 సీట్ల గాను 20, 258 దరఖాస్తులు రాగా అందులో మన విద్యార్థి కూడా ఒక సీటును సాధించడం జరిగింది. మన విద్యాసంస్థకే గర్వకారణంగా ఇంతటి ఘనవిజయాన్ని సాధించి పెట్టినటువంటి ఎం.డి సోహెల్ ను శ్రీ గ్లోబల్ హై స్కూల్ మేనేజ్మెంట్ అయినటువంటి ఇనుకుల్ల దివాకర్ రెడ్డి ,వాహిని , సుధాకర్ రెడ్డి , తిరుపతిరెడ్డి ,మరియు పాఠశాల ప్రిన్సిపల్ రామారావు , వైస్ ప్రిన్సిపల్ చాపల మదుగు తిరుపతిరావు , మరియు ఉపాధ్యాయుని ఉపాధ్యాయులు ప్రత్యేక అభినందనలు తెలియజేయడం జరిగింది. అంతేకాకుండా 2025- 26 సంవత్సరం గాను చింతకాని, బోనకల్ మండలం లో ఉన్నటువంటి స్కూల్స్ లలో కూడా అత్యధికమైన మార్కులు పదో తరగతిలో సాధించడం జరిగింది. ఇంతటి విజయానికి కారకమైనటువంటి తల్లిదండ్రులకు ప్రత్యేకమైన అభినందనలు మేనేజ్మెంట్ వారు తెలియజేయడం జరిగింది. అదే విధంగా ఉపాధ్యాయుని ఉపాధ్యాయులను కూడా పాఠశాల యాజమాన్యం ప్రత్యేకంగా అభినందించడం జరిగింది.